క్లుప్తంగా

సన్మానాలు..

● రిటైర్డ్ ఉద్యోగికి..

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, రిటైర్డ్ తహసీల్దార్ ఆర్.రవీందర్ రావు ఆధ్వర్యాన తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి షేక్.యాకుబ్‌బేగ్‌కు మంగళవారం ఖమ్మం నిజాంపేటలోని ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న యాకుబ్‌బేగ్‌కు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రాంమోహన్, డీ.కే.శర్మ, షేక్.ఖాదర్ పాషా, గట్టు మోహన్, సాగి వెంకటేశ్వర్‌రావు, రామడుగు శీతారామారావు, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● పదవీ విరమణ పొందిన వాచ్‌మెన్‌కు..



భారతి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం (ఎ)లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన చిన్నపొంగు భారతిని వసతిగృహంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి నెల్లూరి విజయ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవోస్ బాధ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, లలిత కుమారి, రాధిక రెడ్డిలతో పాటు కోటపాటి రుక్మారావు, కోడి లింగయ్య, బిక్కు, వెంకటరమణ, వెంకన్న, కొత్త వేంకటేశ్వరరావు, స్టాలిన్, మల్లారెడ్డి, వరలక్ష్మి, కోమలి, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకాలు..

● మాల మహానాడు యూత్ జిల్లా అధ్యక్షుడిగా కమలాకర్



కమలాకర్

ఖమ్మం మామిళ్లగూడెం: మాల మహానాడు యూత్ జిల్లా అధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన పోతురాజు కమలాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదుసు జాకోబ్ ప్రతాప్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కె.చిరంజీవి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరం మల్లయ్య, రాధాకృష్ణ, దయానంద్, నవీన్‌బాబు, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా తిరపయ్య

కూసుమంచి: నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన ఆలేటి తిరపయ్యను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జూలూరి వీరస్వామి, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు తూముల నాగభూషణం తదితరులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

గ్రామీణ వైద్యుల మహాసభను విజయవంతం చేయండి

కామేపల్లి: గ్రామీణ వైద్యుల సహాయ సంఘం ఆధ్వర్యాన రేపు (బుధవారం) ఖమ్మంలో జరిగే గ్రామీణ వైద్యుల మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు దారా సుందర్‌రావు కోరారు. సోమవారం ఆయన తాళ్లగూడెంలో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ వైద్యులు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కోర్ట్
వినోద	మ్యాడ్ స్క్వేర్, ఛావా
సాయిరాం	వీర ధీర శూర
ఆదిత్య	రాబిన్‌హుడ్
శ్రీనివాస	ఎల్2:ఎంపురాన్

- ఖమ్మంగాంధీచౌక్




డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



అభివృద్ధికి ఆమడదూరం..

పేరుకే విలీన గ్రామాలు
- కొత్తగూడెంలో ఎటు చూసినా సమస్యలే
- డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్యే మురుగు
- దశాబ్ద కాలంగా దోమలతో సహవాసం
- పట్టించుకోని పాలకులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కార్పొరేషన్‌లో తమ గ్రామాలు విలీనమైతే అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతుందని, అన్నీ వసతులు సమకూరతాయని కలలు కన్న వారి కలలు కలగానే మిగిలిపోయాయి. ఎటు చూసినా సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. 2012వ సంవత్సరంలో ఖమ్మం పట్టణానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాలన్నింటినీ కలిపి ఖమ్మం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. నాటి నుంచి విలీన గ్రామాల ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ దశాబ్దకాలంగా ఈ ప్రాంతాల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంలా మారింది.

పన్నులు కడుతున్నా..

నగరంలోని అన్ని కాలనీలతో పాటు ఇంటి పన్నులు, నల్లా పన్నులు కడుతున్నా.. తమ ప్రాంతాలు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం కార్పొరేషన్‌లో విలీనమైతే ఇక అంతా అభివృద్ధేనని బాకాలు ఊదారని, కానీ నేడు అభివృద్ధి మాత్రం శూన్యమని కాలనీవాసులు అంటున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే ఎంతో కొంత అభివృద్ధి జరిగేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు, సీసీ రోడ్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

డ్రెయినేజీలు లేక..

కార్పొరేషన్‌లో విలీనమైన కొత్తగూడెం గ్రామంలో కొంత 14వ, కొంత 15వ డివిజన్‌లో విస్తరించి ఉంది. ఈ రెండు డివిజన్లలో డ్రెయినేజీలు లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు దోమలు వృద్ధి చెంది ఆ కాలనీలవాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఫలితంగా వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కొత్తగూడెంలోని గొల్ల బజార్, పశువుల ఆస్పత్రి ప్రాంతంతో పాటు గొందిబజార్ ఇలా ఏ కాలనీలోనూ డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే రోగాల బారిన పడాల్సిందేనని వణుకుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇకనైనా అధికారులు తమ బాధలు పట్టించుకోవాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేవు..



కార్పొరేషన్‌లో విలీనమైతే ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశపడ్డాం. కాని దశాబ్దకాలంగా మౌలిక వసతులు కూడా కల్పించడం లేదు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేవు. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నాం. కష్టపడి సంపాదించిన సొమ్మంతా ఆస్పత్రులకే కట్టాల్సివస్తోంది.

– ఎర్రబోయిన అశోక్, గొల్లబజార్

వ్యాధుల బారిన పడుతున్నాం..



నగరంలో అభివృద్ధి చెందిన కాలనీవాసులతో సమానంగా ఇంటి పన్నులు కడుతున్నాం. అయినా మా ప్రాంతాల అభివృద్ధికి నిధులు విడుదల చేసేందుకు పాలకులకు చేతులు రావడంలేదు. కనీసం డ్రెయినేజీలు అయినా పూర్తిచేసి మమ్మల్ని వ్యాధుల బారి నుంచి కాపాడండి.

– ఎ.చిన్న వెంకటయ్య, గొల్లబజార్

అధికారులకు మొరపెట్టుకున్నాం..



కాలనీ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. గతంలో మా ప్రాంతానికి మేయర్ నీరజ వచ్చినప్పుడు వినతిపత్రం అందించాం. అయినా సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతున్నాం. మంత్రి తుమ్మలతో పాటు మేయర్, అధికారులు పట్టించుకోవాలి.

– ఎర్రబోయిన గోపి, గొందిబజార్

నిలిచిన డిజిటల్ పేమెంట్స్..

ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా అంతరాయం?

ఖమ్మంగాంధీచౌక్: డిజిటల్ పేమెంట్స్ మంగళవారం నిలిచిపోయాయి. వివిధ పేమెంట్స్ యాప్స్ నిర్వహణను నిలిపివేయడంతో డిజిటల్ పేమెంట్స్ జరగలేదు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియడంతో మంగళవారం కొన్ని గంటల పాటు డిజిటల్ యాప్స్‌ను నిలిపివేసినట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఉదయం 11 గంటల సమయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్‌పే, గూగుల్ పే, యోనో, యూపీఐ నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు నిలిచిపోయినట్లు వినియోగదారులు చెబుతున్నారు. పెట్రోలు బంకుల్లో, నిత్యావసర వస్తువుల కొనుగోళ్లలో, షాపుల్లో, కార్పొరేట్ సంస్థల్లో, రవాణా సంస్థల్లో డిజిటల్ విధానంలో నగదు చెల్లింపు అంశాల్లో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నుంచి యాప్స్ పనిచేయడంతో పేమెంట్స్ యథావిధిగా కొనసాగాయి.

స్థానిక ధాన్యాన్ని కొనాలి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న పుల్లయ్య

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న రైస్ మిల్లు యాజమాన్యం స్థానిక రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. మంగళవారం స్థానిక రైస్ మిల్లులో రైతులు కలిసి సమస్యలను వివరించారు. స్థానికంగా మిల్లు ఉండి కూడా కోదాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తుందన్నారు. ఇకనైనా మిల్లు పరిధిలోని రాజేశ్వరపురం, అమ్మగూడెం, మోటాపురం, శంకరగిరితండా, కట్టుకొమ్ముతండా తదితర గ్రామాలకు చెందిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరపురం మాజీ సర్పంచ్ దండా పుల్లయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

కూసుమంచి/నేలకొండపల్లి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో జరుగుతున్న ఆందోళనలో విద్యార్థులకు మద్దతుగా హైదరాబాద్ తరలి వెళ్తున్న సీపీఎం నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, వారి అక్రమ అరెస్టును పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. కూసుమంచిలో అరెస్టయిన వారిలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, మూడ్ గన్యా నాయక్, చీర్ల రాధాకృష్ణ, జగదీష్ ఉన్నారు. అలాగే నేలకొండపల్లి కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, నాయకులు రామారావు, నరసింహారావు, అశోక్, నవీన్, మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకులు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారంలో సోమవారం రాత్రి నేలకొండపల్లి, అనాసాగారానికి చెందిన చెందిన యువకుల తీరుతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గ్రామంలోని ఆలయ సమీపానికి చేరిన యువకుల అరుపులు, కేకలతో సమీపంలోని వారు వారించారు. నేలకొండపల్లికి చెందిన వారికి రాత్రి వేళ ఇక్కడ ఏం పని అని ప్రశ్నించగా, వారు మరికొందరిని పిలిపించారు. దీంతో గొడవ పెరిగే అవకాశం కనిపించగా స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రేషన్ దుకాణం వద్ద ఆందోళన

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి రేషన్ దుకాణం వద్ద రెవెన్యూ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ మల్లేశం తన కుటుంబసభ్యులతో ఆందోళనకు దిగారు. ఇటీవల గ్రామంలో కొంతమంది రేషన్ కార్డులను తొలగించిన విషయంలో వివాదం చోటు చేసుకోగా బాధ్యుడిగా మల్లేశంను చేస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్డుల తొలగింపులో డీలర్ వల్లే జరిగిందని ఆపరేటర్ మంగళవారం నిరసనకు దిగగా.. పోలీసులు ఇరువర్గాలతో చర్చించి తాత్కాలికంగా ఆందోళన విరమింపజేశారు. తహసీల్‌లో అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలని, తక్షణమే అక్రమంగా అరెస్ట్ చేసిన 298 మందిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యార్థులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, జిల్లా నాయకులు వినోద్, వినయ్, మనోజ్, లోకేష్, వెంకటేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం..

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



చింతపల్లి సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద ధ్వంసమైన రోడ్డు

తిరుమలాయపాలెం: రహదారులు అధ్వానంగా మారుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బాడిన పడి ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ఇవి తిరుమలాయపాలెం మండలంలోని వరంగల్ రాష్ట్రీయ రహదారి దుస్థితి.

మోకాలిలోతు గుంతలు..

మండలంలోని కొక్కిరేణి చింతపల్లి సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీల ఎదుట రహదారిపై వేసిన తారు లేచి భారీ గుంతలు ఏర్పడ్డాయి. అయినా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరగడంతో రాత్రి సమయాల్లో రహదారిపై వెళ్లే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం ప్రాంతాల రహదారులపై మోకాలిలోతు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవాలయ 21వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో దేవాలయ ప్రధాన అర్చకులు నరిగిరినాధుని రామాచార్యుల బృందం ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిపారు. హాజరైన భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యాన తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శివాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం



హోమం, ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

కామేపల్లి: కామేపల్లిలోని పురాతన శివాలయాన్ని సోమవారం లక్ష్మీగణపతి హోమంతో తిరిగి ప్రారంభించారు. సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించిన శ్రీబాలత్రిపుర సుందరి ఇష్టకామేశ్వరిస్వామి దేవాలయం(శివాలయం) శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు శివాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా వేద పండితులు బలగం భార్గవశర్మ ఆధ్వర్యాన శివాభిషేకం, విశేష పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి రామకృష్ణ, నరసింహాశర్మ, గొట్టుపర్తి శివాజీ, దమ్మాలపాటి శివాజీ, బండి శ్రీనివాస్, రాందాస్, కృష్ణమూర్తి, నాగేష్, రామనర్సయ్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



సభలో మాట్లాడుతున్న మౌలానా

ఖమ్మంరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ఎర్రజెండా లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా అన్నారు. మండలంలోని మద్దులపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పార్టీ ఏర్పడిన నాటి నుంచి కేవలం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూ అజరామరంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకే కొమ్ము కాస్తూ పేద, మధ్య తనగతి ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండి సురేష్, పాల్తియా శ్రీను, మిడకంటి చినవెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) డివిజన్ అధ్యక్షుడు గోసు పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 13న వైరాలో జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్‌ను మండలంలోని పిండిప్రోలులో మంగళవారం ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై మహాసభలలో చర్చించి భవిష్యత్ నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మీగడ సైదులు, కత్తుల భిక్షం, పుల్లయ్య, రమేష్, వెంకన్న, నాగేశ్వరరావు, కౌసల్య పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మం మామిళ్లగూడెం: నానాటికీ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి అన్నారు. మంగళవారం ఖమ్మం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గోకినపల్లి లలిత అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండపేటలో మహిళపై జరిగిన సామూహిక అత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం హర్షనీయమని, సన్న బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసర సరుకులూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తుడుము ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, పరిమళ, లలిత, సరోజిని, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సన్నాల పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు కల్గిన లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించింది. దీంతో మండలాల్లోని ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాక సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.



కూసుమంచి: లోక్యాతండాలో లబ్ధిదారులతో తహసీల్దార్, నాయకులు

● కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో తహసీల్దార్ కరుణశ్రీ , మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎ.సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో స్థానిక నాయకులు ప్రారంభించారు.

● ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామ పంచాయతీలో సన్న బియ్యం పంపిణీలో భాగంగా కాంగ్రెస్, సీపీఐ నాయకులు రాష్ట్ర సీఎంతో పాటు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బియ్యం పంపిణీని ప్రారంభించారు.

● రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు ప్రారంభించగా.. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, కిలారు వెంకటరమణ, దారావత్ వీరు, బానోత్ కృష్ణ, రాము, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, వెంకటసత్యనారాయణ, తగరం ఆదాం, నల్లగట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 8వ డివిజన్‌లో కార్పొరేటర్ లకావత్ సైదులు ప్రారంభించారు.

● నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ప్రారంభించగా.. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, నాయకులు రమేష్, భద్రయ్య, నాగరాజు, వేణు, అంజిని, నరేష్, రాధాకృష్ణమూర్తి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 24వ డివిజన్‌లో కార్పొరేటర్ కమర్తపు మురళి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, గౌస్, రేఖలక్ష్మణ్, సురేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు .



రఘునాథపాలెం: 8వ డివిజన్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సైదులు



ఖమ్మంరూరల్: కామంచికల్ గ్రామంలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

● తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట, జల్లేపల్లి గ్రామాల్లో బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావు, ఆర్ఐ వీరయ్య, మాజీ ఎంపీపీ మంగీలాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్‌లతో పాటు కిరణ్, ఉపేందర్, అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: కోరట్లగూడెంలో బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం



తిరుమలాయపాలెం: హైదర్‌సాయిపేటలో ప్రారంభిస్తున్న నాయకులు